క్లుప్తంగా

దుంప తోట సాగుపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ శాస్త్రవేత్త సునీత

పెద్దాపురం: దుంప తోట సాగుపై రైతులు మరింత అవగాహన ఉండాలని సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ పి.సునీత, డాక్టర్ ఎం.జానకి అన్నారు. స్థానిక ఏరువాక కేంద్రంలో సోమవారం దుంప సాగుపై రైతులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు సునీత, జానకి మాట్లాడుతూ దుంప తోట సాగుపై రైతులు అప్రమత్తత పాటించాలన్నారు. వ్యవసాయ శాఖాధికారులు సూచిస్తున్న సలహాలు పాటిస్తూ దుంప సాగులో ఆదాయం సాధించాలన్నారు. అనంతరం పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించి, పరికరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ రామభద్ర రాజు, డాక్టర్ సీతారామశర్మ, శాస్త్రవేత్తలు డాక్టర్ సుజాత, డాక్టర్ సుధీర్, ఉద్యాన శాఖాధికారి ఎస్.సుజాత, ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో విజయం సాధించిన యోగేశ్వర్

పెద్దాపురం: ఈ నెల 1, 2 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించిన 8వ అంతర్జాతీయ కరాటే పోటీల్లో పెద్దాపురం విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. స్థానిక వరహాయ్యలపేట యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఆధ్వర్యంలో యోగా గురువు పూజిత సూర్యశ్రీ వద్ద శిక్షణ పొందుతూ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనపర్చారు. 14, 15 సంవత్సరాల కాటా విభాగంలో తెప్పల యోగేశ్వర్ వెండి, కుమితిలో కాంస్య పతకాలు సాధించాడు. 12 సంవత్సరాల కాటా విభాగంలో యాసలపు సూర్యకళ బంగారు పతకం, 11 సంవత్సరాల బాలుర విభాగంలో కరాటే కుంతి విభాగంలో పి.లోకేష్ కాంస్య పతకాలు సాధించారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులను పీసీసీ గౌరవ అధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్, అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్ తదితరులు అభినందించారు.

10 నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు

సామర్లకోట: ఈనెల 10వ తేదీ నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయించిన్నటు ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10న తెలుగు, 11న హిందీ 12న ఇంగ్లీషు, 15న లెక్కలు, 17న ఫిజికల్ సైన్సు, 18న బైయాజికల్ సైన్సు, 19న సాంస్క్రీట్, 20న సోషల్ పరీక్షలు ఉంటాయని తెలిపారు. ఈ పరీక్షలకు ప్రతి విద్యార్థి హాజరుకావాలన్నారు.

ఆర్థిక సాయం



కొండమ్మ కుటుంబానికి నిత్యావసర వస్తువులు అందిస్తున్న రాజేశ్వరి తదితరులు

కొత్తపల్లి: అమీనాబాదు గ్రామానికి చెందిన మత్స్యకార మహిళ కంబాల కొండమ్మ అనారోగ్యం కారణంగా ఇటీవల మృతి చెందింది. ఆమె కుటుంబానికి అదే గ్రామానికి చెందిన మత్స్యకార నాయకురాలు మడదా రాజేశ్వరి ఆ కుటుంబాన్ని సోమవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. 25 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు, ఆర్థిక సహాయం అందించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన వివాహిత శివకోటి బేబీ రాణి సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. మృతురాలికి భర్త రాజు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమెను అదనపు కట్నం తెమ్మని భర్త రాజు అత్త ధనలక్ష్మి, మరిది శ్రీను మానసికంగా, శారీరకంగా వేధించేవారు. ఈనేపథ్యంలో జనవరి 20వ తేదీన ఇంటి వద్ద పేరు తెలియని గడ్డి మందు తాగింది. దీంతో ఆమెను తల్లి దడాల రమణ పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి తీసుకువెళ్లగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఆమె మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఆమె మృతికి కారణమైన పై ముగ్గురిపై మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గొల్లప్రోలు ఎస్సై ఎన్.రామకృష్ణ తెలిపారు.

మంచుతో మామిడి పోతోంది..!

- మామిడి దిగుబడిపై మంచు ప్రభావం
- గత రెండు రోజులుగా నాశనమవుతున్న మామిడి పూత
- సస్యరక్షణ చర్యలు పాటించాలంటున్న అధికారులు

పిఠాపురం: ఈ ఏడాది మామిడి రుచులు చేదెక్కనున్నాయి. అధిక మంచుతో పూత మాడిపోయి మామిడి చెట్లు వెలవెలబోతున్నాయి. పూత దశలో విరగబూసి ఉన్న మామిడి చెట్లు గత నాలుగు రోజులుగా కురిసిన మంచు వల్ల పూత లేని పరిస్థితి నెలకొంది. ఎక్కడ చూసినా పూత వచ్చిన చెట్లు రానురాను మంచు కారణంగా మాడిపోవడంతో పూత రాలిపోతోంది. దీంతో దిగుబడి అమాంతం పడిపోనుంది. దీంతో ప్రస్తుత మామిడి సీజన్‌లో మంచు మామిడి పంటపై తీవ్ర ప్రభావాన్ని చూపనుందని మామిడి దిగుబడి తగ్గి పెట్టుబడులు కూడా రాని పరిస్థితులు నెలకొంటాయని వేల రూపాయాల్లో నష్టాలు వస్తాయని మామిడి రైతులు వాపోతున్నారు. అధిక పొగమంచు మామిడి పూత దశలోనే నాశనం కావడం మామిడి దిగుబడిపై ప్రభావాన్ని చూపిందంటున్నారు. ముఖ్యంగా పిఠాపురం నియోజక వర్గంలో పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలో సుమారు 4 వేల హెక్టార్లలో మామిడి తోటలు సాగవుతున్నాయి.

ఉద్యానవన శాఖ అధికారులు అప్రమత్తం

ప్రతీ ఏటా డిసెంబరు, జనవరి మాసాల్లో మామిడి పూత ప్రారంభమవుతుంది. ఈఏడాది ఈరెండు నెలల్లోను మామిడి పూత ఆశాజనకంగానే వచ్చినప్పటికి భారీగా మంచు కురవడంతో పూత లేకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. ఈనేపథ్యంలో ఉద్యానవన శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మామిడి అధికంగా ఉన్న ప్రాంతాల్లో తోట బడులు నిర్వహించి మామిడిలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు వివరిస్తున్నారు.

మామిడి తోటల్లో యాజమాన్య పద్ధతులు

ప్రస్తుతం అధిక మంచు వల్ల మామిడి పూతపై తేనే మంచు పురుగు ఉధృతి పెరిగింది. దీంతో రైతులు యాజమాన్య పద్ధతులు అవలంబించాలని పిఠాపురం ఉద్యానవన శాఖ అధికారి శైలజ తెలిపారు. తేనె మంచు పురుగు వల్ల పూత రాలిపోతుందని ప్రస్తుతం నియోజకవర్గంలో ఎక్కడ చూసినా తేనే మంచు పురుగు ప్రభావం మామిడి తోటలపై ఎక్కువగా ఉందని ఆమె తెలిపారు. దీని ప్రభావం వల్ల పిందె తయారవ్వకుండా పోతుందని ఒక వేళ తయారైనా పిందె కూడా రాలి పోతుందన్నారు. తోటలకు తగిన గాలి వెలుతురు ప్రసరించేలా చూసుకోవాలన్నారు. తేనె మంచు పురుగుల నివారణకు తోటలను కలుపు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి. వేప నూనె, క్రిమిసంహారక మందులైన బుప్రోఫిజిస్ 1.5 25 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. మోనోక్రోటోఫాస్ ఒక మిల్లీలీటరు, ఎసిఫేట్ 1.5 గ్రాముల వంటి వాటిని మార్చి మార్చి చెట్టు అంతా తడిసేలా పూత నల్లబడిన తరువాత పిందె ఏర్పడే సమయంలో పిచికారీ చేసుకోవాలి.



నాలుగు రోజుల క్రితం పూతతో కళకళలాడుతున్న మామిడి చెట్టు



సోమవారం పూత మాడిపోయి నల్లబారిన మామిడి చెట్టు

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



ప్రస్తుతం మంచు అధికంగా కురుస్తుండడంతో తేనె మంచు పురుగు ఉధృతి పెరిగింది. మామిడి పూత బాగా రాలిపోతోంది. దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. రైతులు సమస్య రక్షణ చర్యలు చేపట్టాలి. ఉద్యానవన శాఖ ద్వారా మామిడి రైతులకు యాజమాన్య పద్ధతులు తెలపడంతో పాటు తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నాం. మామిడి తోటలలో ఎటువంటి మార్పులు గమనించినా వెంటనే స్థానిక ఉద్యానవన శాఖ సిబ్బందిని సంప్రదించాలి. ప్రస్తుతం పూతపై మంచు ప్రభావం నుంచి రక్షించడానికి తగిన చర్యలు తీసుకోవాలి. సస్యరక్షణ చర్యలు పాటించాలి.

– కేఎస్ శైలజ, ఉద్యానవన శాఖ అధికారి, పిఠాపురం

ఇన్‌చార్జి కమిషనర్‌గా అసిస్టెంట్ కలెక్టరు



ట్రైనీ కలెక్టరు భావనకు స్వాగతం పలికిన మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

సామర్లకోట: జిల్లాలో అసిస్టెంట్ కలెక్టరుగా నియమితులైన ఎస్.భావన సోమవారం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అసిస్టెంట్ కలెక్టరుగా వివిధ శాఖల్లో విధులు తెలుసుకొనేలా శిక్షణ పొందవలసి ఉంది. దీనిలో భాగంగా ఇప్పటికే సామర్లకోట తహసీల్దార్‌గా సుమారు నెల రోజుల పాటు విధులు నిర్వహించి రెవెన్యూకు సంబంధించిన అంశాలపై అవగాహన పెంచుకున్నారు. కాగా మున్సిపాలిటీలోని విధులు, పాలనపై అవగాహన పెంచుకోవడానికి మూడో తేదీ నుంచి 23వ తేదీ వరకూ ఇన్‌చార్జి కమిషనర్‌గా భావనను నియమిస్తూ జిల్లా కలెక్టరు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆమె సోమవారం మున్సిపల్ కార్యాలయానికి రావడంతో కమిషనర్ ఎ.శ్రీవిద్య ఆమెకు స్వాగతం పలికారు. ఈ మేరకు మున్సిపాలిటీలోని ముఖ్యమైన శాఖలకు చెందిన అధికారులను ఆమె పరిచయం చేసుకున్నారు. ఇంజినీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్‌శాఖ విధులను ట్రైనీ కలెక్టరు తెలుసుకున్నారు. ఈ కార్యాక్రమంలో మేనేజరు కె.కనకరాజు, ఏఈ రమేష్, రెవెన్యూ అధికారి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

తంసూర్యం ప్రణమామ్యహం..!

- నేడు రథసప్తమి పర్వదినం
- ప్రత్యేక పూజలకు సిద్ధమైన దేవాలయాలు

పిఠాపురం: రథ సప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని పిఠాపురం నియోజక వర్గ పరిధిలో సూర్యభగవానుడి ఆలయాల్లో ప్రత్యేక పూజల నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. లోకానికి ప్రత్యక్ష దైవమైన సూర్యభగవానుడని, సృష్టిలో మొట్టమొదటి సూర్యభగవానుడుని సృష్టించినట్లు యజుర్వేదంలో ఉన్నట్లు పెద్దలు చెబుతున్నారు. రథసప్తమి రోజే ఈ లోకానికి సూర్య తేజస్సు కనిపించిందని శాస్త్రాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఉత్తరాయ పుణ్యకాలంలో సూర్యగమనం దక్షణ దిశ నుంచి ఉత్తర దిశకు మారడం ఈ రథ సప్తమి పర్వదినాన్ని ప్రారంభమవుతుంది. అందుకే ఆంధ్రులకు రథసప్తమి గొప్ప పండుగగా నిర్వహించుకుంటారు. రథసప్తమి రోజున మహిళలు సూర్యోదయానికి ముందు లేసి రేగిపండు, జిల్లెడి ఆకు నుదటపై ధరించి స్నానం చేయడం ఆచారం. ఇలా చేయడం వల్ల సకల పాపాలు పోతాయని భక్తుల నమ్ముతారు.

సూర్యనమస్కారాలు

ముఖ్యంగా రథసప్తమి రోజున సముద్రాలు, నదులలో పుణ్యస్నానం ఆచరించి మడి బట్టలతో సూర్యభగవానుడికి నీళ్లు వదిలి సూర్యనమస్కారాలు చేయడం ఆచారంగా వస్తోంది. కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ సముద్ర తీరంలోని రథసప్తమి సందర్భంగా అనేక మంది భక్తులు సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించనున్నారు. పిఠాపురంలో ప్రముఖ పుణ్య క్షేత్రాలైన పాదగయ, కుంతీమాధవస్వామి వారి క్షేత్రంలలోను ప్రత్యేక పూజలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.



ఉప్పాడ సాగర తీరంలో సూర్యోదయం

గ్రామాల్లో ప్రత్యేక పూజలు

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రథసప్తమి పర్వదినాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు. మహిళలు ఆవు పేడతో ప్రత్యేక ప్రదేశంలో అలికి ముగ్గులు పెట్టి వాటిపై పొయ్యిలు (దాయలు) ఏర్పాటు చేసి వాటిపై రాగి లేదా ఇత్తడి చెంబులు ఉంచి వాటిలో పాలుపోచి పాయసం తయారు చేస్తారు. ఆవుపేడను మండించడం ద్వారా వచ్చే పొగ కొన్ని క్రిమికీటకాదులను నాశనం చేస్తుందని చెబుతుంటారు. ఈ పాయసం తయారు చేసే సమయంలో గరిటికి బదులు చెరుకు ముక్కను వాడతారు. పొయ్యిపై ఆవు పాలు ఎంత బాగా పొంగితే అష్టైశ్వర్యాలు అంత బాగా కలుగుతాయని భక్తుల నమ్మకం. తయారైన పాయసాన్ని సూర్యభగవానుడికి నైవేద్యంగా పెట్టి పూజలు నిర్వహిస్తారు. ఇంటిల్లపాది ఈ పూజల్లో పాల్గొంటారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఉన్న దేవాలయాలకు వెళ్లి దర్శనం చేసుకుంటారు. సూర్యభగవానుడుకి జిల్లెడు ఆకులు, రేగిపళ్లు, చెరకు ముక్కలు ప్రసాదంగా పెడతారు. ఎంతో భక్తితో ఈ పూజలు చేశారు.

రథసప్తమి వేడుకలకు సిద్ధం

నేడు సూర్యనారాయణమూర్తి కల్యాణం



పంచారామ క్షేత్రంలో సూర్యనారాయణమూర్తి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో ఉన్న సూర్యనారాయణ మూర్తి ఆలయంలో మంగళవారం రథ సప్తమి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. ఈ మేరకు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, పట్టు వస్త్రాలు, పూలతో అలంకరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్, భక్త కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మధ్యాహ్నం భక్త సంఘం నాయకుడు బిక్కిన సాయి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సూర్యనారాయణ మూర్తి కల్యాణం జరుగుతుందని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని స్వామి వారి కల్యాణం తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఈఓ తెలిపారు.

అదే విధంగా స్థానిక ఐదు తూముల వద్ద ఉన్న అన్నపూర్ణ సమేత రామ లింగేశ్వరస్వామి ఆలయంలో రథ సప్తమిని పురస్కరించుకొని సూర్యనారాయణమూర్తి కల్యాణం నిర్వహిస్తున్నట్టు ఆలయ వ్యవస్థాపకులు పరమానందగిరి స్వామి చెప్పారు. రథ సప్తమిని పురస్కరించుకొని మహిళలు ఇళ్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జిల్లెడు ఆకులు, రేగు పళ్లు తలపై ఉంచుకొని స్నానాలు చేస్తారు. ఆవు పిడకలతో స్వామి వారికి పాయసం తయారు చేసి పూజలు చేస్తారు. ఈ మేరకు మహిళలు రేగు పండ్లు, చెరకు ముక్కలు కొనుగోలుతో మార్కెట్‌లు సందడిగా మారాయి.



భువనేశ్వరి పీఠంలో సూర్యనమస్కారాలు చేస్తున్న రుత్విక్కులు (ఫైల్)

భువనేశ్వరి పీఠంలో...

పెద్దాపురం: స్థానిక వర్జుల వారి వీధిలోని భువనేశ్వరి పీఠంలో రథ సప్తమి వేడుకలు మంగళవారం నిర్వహించనున్నట్లు లలితా వాస్తు జ్యోతిష్యాలయ నిర్వాహకులు చింతా గోపిశర్మ సిద్ధాంతి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రథ సప్తమి వేడుకల్లో భాగంగా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సూర్య నమస్కార సహిత మహా సౌరహోమం నిర్వహించనున్నారు. సుమారు 12 మంది రుత్విక్కులతో ఈ కార్యక్రమం జరగనుంది. పాల్గొనే భక్తులు ముందుగా 9866193557 నంబర్‌కు తెలియజేయాలని గోపిశర్మ సిద్ధాంతి కోరారు.



అమరగిరి మెట్టపై రథసప్తమి వేడుకలకు సిద్ధమైన సూర్యనారాయణ స్వామి ఆలయం

పాండవుల మెట్టపై..

రథ సప్తమి వేడుకలకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన పెద్దాపురం సూర్యనారాయణ స్వామి స్థానిక అమరగిరి మెట్ట (పాండవుల మెట్ట) ఆలయం సిద్ధమవుతోంది. ఉభయ రాష్ట్రాల్లో అత్యంత ప్రసిద్ధి గాంచిన సూర్యనారాయణ స్వామి ఆలయం విద్యుద్దీలంకరణ, మండపాలను ఆలయ కమిటీ నిర్వాహకులు వై.అనంతలక్ష్మి, గీతా వాణిల ఆధ్వర్యంలో మెట్టపై అన్ని ఏర్పాట్లు చేశారు. 71వ మాఘమాస రథసప్తమి వేడకల్లో భాగంగా ఏటా మెట్టపై వేడుకలు నిర్వహించనున్నారు. నాలుగో తేదీ ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభమయ్యే వేడుకలు పాలు పొంగలి, కల్యాణం, హోమంతో పాటు సాయంత్రం 4 గంటలకు స్వామి వారికి పుష్పయాగం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. స్వామి కల్యాణాన్ని తిలకించి పాలు పొంగించారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా విద్యాశాఖాధికారి రమేష్

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ అన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని ప్రభుత్వ హైస్కూల్, తోట గోపాలకృష్ణ మున్సిపల్ హై స్కూళ్లను ఆయన పరిశీలించారు. ఈ మేరకు ఉపాధ్యాయులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 100 రోజుల యాక్షన్ ప్లాన్ సక్రమంగా అమలు చేయాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. ఈ మేరకు ప్రతి వారం సీ, డీ గ్రేడ్ విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం అదనపు తరగతులను నిర్వహించి వాటికి విద్యార్థులు తప్పని సరిగా హాజరయ్యేలా తల్లిదండ్రుల సహకారం తీసుకోవాలని సూచించారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులు తెలుగు, ఇంగ్లిషు అంశాలలో రాత నైపుణ్యాలను మెరుగు పర్చుకునేలా చూడాలన్నారు. ఇదే సమయంలో ఇంగ్లీషు, తెలుగు పాఠ్యాంశాలను తరగతి గదిలో చదివించాలన్నారు. గణితానికి సంబంధించి కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగహారంపై పట్టు సాధించేలా చూడాలని తెలిపారు. మరో వారంలో పాఠశాలకు తనిఖీకి వస్తానని ఉపాధ్యాయులు, విద్యార్థులలో మార్పులు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యా శాఖాధికారులు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, హెచ్ఎంలు ప్రసూన, టి.శ్యామ్ సుందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకొంటున్న డీఈఓ

మఠం సెంటర్‌లో ట్రాఫిక్ జామ్

సామర్లకోట: స్థానిక మఠంసెంటర్‌లో సోమవారం సాయంత్రం ట్రాఫిక్ స్తంభించింది. రథ సప్తమి వేడుకలను పురస్కరించుకొని పూజా సామగ్రి కొనుగోలుకు వచ్చిన వారితో సెంటర్ నిండిపోవడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. కొబ్బరి కాయలు, అరటి పండ్లు, పూవ్వులు, రేగుపండ్లు, చెరకు ముక్కలు విక్రయించడానికి చిరు వ్యాపారస్తులు దుకాణాలు ఏర్పాటు చేశారు. దాంతో వాహనచోదకులు వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేశారు. పెద్దాపురం రోడ్డులో ఒన్‌వే అమలు చేయకపోవడంతో ఎదురు ఎదురుగా భారీ వాహనాలు రావడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. దీనికి తోడు మఠం సెంటర్‌లోని అంబటి షాపింగ్ కాంప్లెక్స్ వద్ద పూడిక తీత పేరుతో కల్వర్టును కూల్చి వేయడంతో ఆయా షాపులకు వచ్చే వారు తమ వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేశారు. అసలే రోడ్డుకు ఇరువైపులా కల్వర్టులు కూల్చి వేయడంతో వాహన చోదకులు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. విషయం తెలుసుకొని ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు సంఘటనా ప్రదేశానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



సెంటర్‌లో నిలిచిన వాహనాలు

సరస్వతీ నమస్తుభ్యం

- అమ్మవారికి ప్రత్యేక అలంకరణ
- ఘనంగా సరస్వతీ పూజలు, అక్షరాభ్యాసాలు

పిఠాపురం: వసంత పంచమి సందర్భంగా సోమవారం పిఠాపురం నియోజకవర్గంలోని పలు దేవాలయాల్లో సరస్వతీదేవికి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో అపర్ణాదేవి అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులుఆ ఆకొండి ప్రభాకరశాస్త్రి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి సమక్షంలో చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. పిఠాపురం పాదగయ క్షేత్రంలో ఉన్న సరస్వతీ దేవి అమ్మవారి ఆలయంలోను అక్షరాభ్యాసాలు నిర్వహించారు. దుర్గాడలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పిల్లలకు విద్యాభ్యాసాలు చేయించి పుస్తకాలు పంపిణీ చేశారు.

పంచారామ క్షేత్రంలో సరస్వతీదేవికి పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో వేంచేసి ఉన్న సరస్వతీదేవి అమ్మవారి జన్మదిన వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. వసంత పంచమి సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని పూజలు చేశారు. పూజల్లో పాల్గొన్న విద్యార్థులకు దాత మాజీ ఎంపీపీ కొండపల్లి కృష్ణమూర్తి దంపతులు పుస్తకాలు, పెన్ను, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సరస్వతి హోమం, పూర్ణాహుతి కార్యక్రమంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కౌడా చైర్మన్ తుమ్మల బాబు, బీజేపీ నియోజకవర్గక ఇన్‌చార్జి విత్తనాల వెంకటరమణ పాల్గొన్నారు. భీమేశ్వరస్వామి వారికి ప్రీతైన రోజు కావడంతో ఆలయం భక్తుల రద్దీగా మారింది. అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేసి పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో ప్రత్యేకాలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాలను ఆలయ పండితులు సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, అభిషేక పండితులు అల్లకి రాజ్‌గోపాల్ శర్మ, వేమూరి చంటి నిర్వహించారు. ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం, ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ అడబాల కుమారస్వామి, భక్త సంఘ నాయకులు బిక్కిన సాయి, తలుపుల అంజనీకుమార్ భక్తులకు సేవలందించారు. అదే విధంగా మాధవపట్నంలో ఉన్న యండమూరి వీరేంద్రనాథ్ విద్యా పీఠంలో సరస్వతిదేవికి విద్యార్థులతో పూజలు చేశారు.



పిఠాపురం పాదగయ క్షేత్రంలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్న అర్చకులు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో పూజలు అందుకున్న సరస్వతీదేవి



సరస్వతీదేవి అలంకరణలో అపర్ణాదేవి అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో పాదగయ క్షేత్రంలో ఉన్న సరస్వతీదేవి



అపర్ణాదేవి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్న అర్చకులు



ప్రత్యేక అలంకరణలో దుర్గాడ అమ్మవారు



అపర్ణాదేవి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్న అర్చకులు



విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేసిన దాత కృష్ణమూర్తి దంపతులు, ఉత్సవ కమిటీ చైర్మన్, చిత్రంలో ఎమ్మెల్యే రాజప్ప

శివరాత్రి ఉత్సవాలకు రాట ముహూర్తం



పాదగయ క్షేత్రంలో పందిరి రాట వేస్తున్న ఆలయ ఈఓ జగన్మోహన్ శ్రీనివాస్

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రంలో మహా శివరాత్రి ఉత్సవాలకు సోమవారం పందిరి రాట వేశారు. ఆలయ ఈఓ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, మహా శివరాత్రి ఉత్సవ పనులను ప్రారంభించారు. ఈ నెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఈఓ తెలిపారు.

పోస్టల్ ఏటీఎం కార్డు లేక అవస్థలు

బాలాజీచెరువు: పోస్టల్ ఏటీఎం కార్డులు సరఫరా లేక తపాలా ఖాతాలు కలిగిన వారు అవస్థలు పడుతున్నారని పోస్టల్ ఎంప్లాయిస్ పెన్షనర్స్ అసోషియేషన్ కార్యదర్శి తురగా సూర్యారావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇదే అంశాన్ని ఆలిండియా పోస్టల్ ఆర్ఎంఎస్ అసోషియేషన్ సెంట్రల్ హెడ్ ప్రెసిడెంట్ కే రాఘవేంద్రన్ సెంట్రల్ గవర్నమెంట్ దృష్టికి తీసుకెళ్లారని, త్వరలో కార్డులు పంపిణీకు చర్యలు తీసుకుంటామని బదులిచ్చారని తెలిపారు.

CHANGE OF NAME
I, NALLABELLI LAXMI W/o. Gangula Kiran Kumar, D.No. 2-2-72, Kummari Street Temple, Pithapuram, Kakinada Dt, A.P. I have changed my name from GANGULA LAKSHMI (Old name) to NALLABELLI LAXMI (New name) hence forth I am being called NALLABELLI LAXMI W/o. Gangula Kiran Kumar, for all purposes.